# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

### ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి




తెలుగు సినిమా పరిశ్రమ సెంటిమెంట్లకి నిబంధనలు లేని బందీ అనేది అందరికీ తెల్సిన విషయమే. అందులో ఒక సెంటిమెంట్..ఏదైనా సినిమా నిర్మాణదశలో చాలా రోజులు ఆగిపోయిందంటే, అది సూపర్ హిట్ అయ్యే అవకాశాలు ఎక్కువ అనేది ఒకటి. సెంట్మెంట్ అంటున్నాం కాబట్టి ఒక్కోసారి నిజం కావొచ్చు.. కాకపోవచ్చు. 30 ఏళ్ళ క్రిందట వచ్చిన శోభన్ బాబు సినిమా 'మల్లెపూవు', ఇటీవల వచ్చిన 'ఢీ' , నిన్నా మొన్నా వచ్చిన 'అరుంధతి' ఇలాంటి సినిమాలన్నీ ఈ సెంటిమెంట్ని బలపరచేవి. ఐతే ఈ సెంట్మెంట్ని నిజంచేసే ఉదాహరణ 50 సంవత్సరాల క్రిందటే ఒకటి జరిగింది. ఒకే థియేటర్లో సంవత్సరం పాటు ఆడిన సినిమా, 50 ఏళ్ళ క్రిందటే 62 కేంద్రాల్లో శతదినోత్సవం చేసుకున్న మొట్టమొదటి పూర్తి గేవా కలర్ తెలుగు సినిమా 'లవకుశ' గుర్తుంది కదా..! ఈ సినిమా నిర్మాణం 1958 లో మొదలైంది. రామారావు, అంజలి, కన్నాంబ, నాగయ్య..లాంటి తారాగణానికి తమిళంలో కూడా మంచి డిమాండ్ ఉండడంతో తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి నిర్మాణం మొదలుపెట్టారు. కొంతకాలం ఏకకాలంలో రెండూ భాషల్లోనూ నిర్మాణం సాగాక బ్రేక్ పడింది. తారల కాల్ షీట్ల సమస్యతో అనుకున్నట్లు చిత్రీకరణచెయ్యలేక పోయారు. ఖర్చు తడిసి మోపెడయింది. తాత్కాలికంగా



చిత్రనిర్మాణం ఆపక తప్పలేదు. ఒకటి, రెండు నెలలుకాదు..దాదాపు 4 సంవత్సరాలు 'లవకుశ' ఒక్క అంగుళం కూడా ముందుకి సాగలేదు! ఆ సమయంలో పెట్టుబడికోసం నిర్మాత శంకరరెడ్డి పడిన ఇబ్బందులు ఆ భగవంతుడికే తెలుసు. మళ్ళీ 1962 లో 'లవకుశ' నిర్మాణం పట్టాలమీద కెక్కింది. 1963లో విడుదలైంది 'లవకుశ'..! తర్వాత అంతా చరిత్రే..! నిశితంగా గమనిస్తే లవ, కుశులు ఒక్కో చోట వయసు వ్యత్యాసం బాగా వున్నట్లు తెలుస్తుంది.!

***



అల్లు రామలింగయ్య గారు నటుడిగా ఉచ్ఛ దశలో ఉన్నప్పుడు కూడా మద్రాసులోకానీ, హైదరాబాదులో కానీ ఒక్కరే హోటల్కి వెళ్ళి టిఫిన్ చేసేవారు. హైదరాబాదు , పంజాగుట్టలోని షాన్బాగ్ హోటల్కి వెళ్ళి రెండిడ్లీలు తిని 'చాలా బాగుందోయ్..' అని అభినందించి నడుచుకుంటూ వెళ్ళేవారట. జనం చుట్టుముట్టి 'మీరు అల్లు గారు కదా..!?" అని అడిగితే "ఏం ..మీకేమైనా డౌటా?" అనే వారట. . వాళ్ళింకా నమ్మలేక పోతుంటే " ఏమండోయ్ మనకెవరూ డూప్ లు లేరు.. అంతా ఒరిజినలే.." అని

నవ్వించేవారట..!

***



ఏదైనా వ్యాపార ప్రణాళికలో ఎన్ని మార్పులు చేర్పులు, చివరి నిమిషంలో ఆశ్చర్యకర పరిణామాలు జరగవచ్చో అన్నీ జరిగే అవకాశాలున్న పరిశ్రమ చిత్రసీమ. ముందుగా అనుకున్న తారాగణం, సాంకేతిక నిపుణులు మధ్యలో మార్పుకి గురికావడం తెలుగు చిత్రసీమలో ఎప్పటినుంచీ వస్తున్నదే 50 ఏళ్ళ క్రిందటి సూపర్ హిట్ సినిమా 'నమ్మినబంటు'కి ముందుగా అనుకున్న సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు గారు. అందులో 'చెంగు చెంగునా గంతులు వేయండి..', 'తెలతెల వారెను లేవండమ్మా..', ' పొగరు బోతు పోట్ల గిత్తరా..' పాటలు సాలూరు గారు స్వరపరచినవే. ఆ సినిమా తమిళ వెర్షన్‌కి సంగీతం సమకూర్చే విషయంలో కవి ఉడుముల్లై నారయణతో వచ్చిన తేడాల వల్ల ఆయన ఆ ప్రోజెక్టు నుంచీ తప్పుకున్నారు. మాస్టర్ వేణు గారు 'నమ్మినబంటు' లోని మిగతా పాటల్ని పూర్తి చేశారు. అలానే దాదాపు అదే సమయంలో నిర్మాణమైన 'సీతారాముల కళ్యాణము' సినిమాకి కూడా ముందుగా సంగీత దర్శకునిగా సాలూరి రాజేశ్వరరావు గారినే అనుకున్నారు. కానీ నిర్మాతలతో వచ్చిన విభేదాల వల్ల ఆయన అందులోనుంచీ తప్పుకున్నారు. గాలిపెంచల నరసింహారావు గారు ' సీతారామ కళ్యాణం' కి అజరామరమైన సంగీతాన్ని అందించిన విషయం రసజ్ఞులకు తెలిసిన విషయమే.

***




సీతారామ కళ్యాణం సినిమాకి అఫిషియల్‌గా దర్శకుడి టైటిల్ కార్డ్ ఉండదు. నిజానికి ఆ సినిమా దర్శకత్వ విభాగం మొత్తాని ఎన్టీఆర్.గారే స్వయంగా పర్యవేక్షించారు. అదే ఆయనకి తొలి దర్శకత్వ అనుభవం. ఎక్జిక్యూటివ్ దర్శకునిగా ఐన్.ఎన్.మూర్తి గారిని పెట్టుకున్నారు. ఈ ఐన్.ఎన్. మూర్తి గారు తర్వాతి కాలంలో 'సుఃఖదుఃఖాలు','జగత్ కిలాడీలు',' జగమే మాయ',' శ్రీరామబంటు' లాంటి సినిమాలకి దర్శకత్వం వహించారు. ఈ సినిమా చూసిన కంచి పీఠాధిపతి గారి రామారావు గారిని ' విశ్వవిఖ్యాత నట సార్వభౌమ' అని దీవించారు. ఇప్పటికీ ఆయనకి ప్రజల హృదయాల్లో అదే చెరగని బిరుదుగా నిలిచిపోయింది.

***



మహానటి సావిత్రి నటించిన మొదటి సినిమా నుంచీ ఆమెని తొలగించిన సంగతీ, ఆ తరువాత చాలా కాలం ఆమెకి అవకాశాలు రాలేదన్న సంగతీ చాలామందికి గుర్తుండే ఉంటుంది. సావిత్రి కెరీర్ మొదటి రోజుల్లో ఆమెకి డైలాగ్ మోడ్యులేషన్‌లో అక్కినేని గారు సలహా ఇచ్చేవారు. అక్కినేని కంటే సావిత్రి 12 సంవత్సరాలు చిన్న. ఐనా సావిత్రితో వేషం అంటే ఆయనకి సవాలుగా ఉండేది. సంభాషణోఛ్ఛారణలో గురువైన అక్కినేనికే 'సుమంగళి' సినిమాలో ఒక చోట సావిత్రి గారు సలహాలిచ్చేవారట. అవి విన్న అక్కినేని గారు సావిత్రిలో వచ్చిన పరిణితికి ఆశ్చర్యపోతూ ఆమె సలహాలని సహృదయంతో స్వీకరించారట. అప్పటినుంచీ సావిత్రే అక్కినేనికి గురువుగా ఉండేవారట. 'మూగమనసులు' సినిమా నిర్మాణం ఊహాత్మకంగా నైనా లేక పూర్వమే, ఆత్రేయ గారు ఒకసారి సావిత్రితో 'గోపీ' అన్న పిలుపుని ఎన్ని రకాలుగా చెప్పగలవో ప్రయత్నించు' అన్నారట. దాదాపు 30 విభిన్న శైలుల్లో 'గోపీ' అనే పిలుపుని




వినిపించారట సావిత్రి! దటీజ్ మహానటి..!!

***

ఈ రోజుల్లో సినిమా నిర్మాణంలో వచ్చిన సాంకేతిక పురోభివృద్ధితో అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఐతే ఇలాంటి సౌకర్యాలు లేనిరోజుల్లోనే ఎన్నో అద్భుతాలు చేసిన సాంకేతిక నిపుణులు తెలుగు పరిశ్రమలో ఎంతో మంది ఉన్నారు. వారిలో ఛాయాగ్రాహకుడు సెల్వరాజ్ ఒకరు. తెలుగులో మొట్టమొదటి ద్విపాత్రాభినయ సినిమా 'ఇద్దరు మిత్రులు'. దీనికి సెల్వరాజ్ గారే చాయాగ్రాహకులు. అప్పట్లో ఉన్న పరిమితమైన అవకాశాలలోనే అక్కినేనిని అత్యంత అందంగా రెండు పాత్రల్లోనూ చూపించిన సెల్వరాజ్ గారిని ఆరోజుల్లోనే అందరూ కెమేరా కింగ్‌లా చూసే వారు. 'ఇద్దరు మిత్రులు ' సినిమాలో అక్కినేని తాగి కారులో వేగంగా ఇంటికి వచ్చే సన్నివేశాన్ని చిన్న బ్యాటరీ లైటు సాయంతో కారు వెనుక సీట్లో కూర్చొని హైదరాబాదు అబిడ్స్ వీధుల్లో చిత్రించారు. ఈ సినిమా శతదినోత్సవం వేడుకల్లో సెల్వరాజ్ ప్రతిభని ప్రత్యేకంగా గుర్తిస్తూ ఆయనకి వజ్రపుటుంగరాన్ని బహూకరించారట. ఐతే ఆ సినిమాకి రెండో కన్ను దర్శకుడు ఆదుర్తి గారు. ఆదుర్తికి కూడా మరో వజ్రపుటుంగరాన్ని బహూకరించబోతే దాని కాయన 'నాకు ఈ ఉంగరం ఇస్తే సెల్వరాజ్ నేనూ ఒకటే ఐపోతాం. నిజానికి సెల్వరాజ్ కాంట్రిబ్యూషన్ ఈ సినిమాలో చాలా ఎక్కువ. ఈ బహుమానం ఆయనకే యునిక్‌గా దక్కనివ్వండి..' అన్నారట.. ! అదీ హృదయ వైశాల్యమంటే..!

***

## వీరెవరబ్బా..!??


1


2


3


4


5

సమాధానాలు చివరి పేజీలో

## సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు



మంచితనం చేతకాని తనమీనాడు
మానవత్వమున్న బ్రతుకలేడు ఎవడు
ఉన్ననాడె అందరు మనకు ఆప్తులు
చెరువు నిండినప్పుడె చేరు కప్పలు

***ఎదురీత (1962)***

పూవును తేనియ ఎందులకు - తేటికి విందులు చేయుటకు
తేటికి రెక్కలు ఎందులకు - పూవును మోసం చేయుటకు

***కానిస్టేబుల్ కూతురు (1963)***

నన్నిడిచి నీవెళితే నీవెంట నేనుంట
నిన్నిడిచి నే వెళితే నువు బ్రతకలేవంట
ఇది నీ గొప్ప నా గొప్ప కాదు పిల్లోడా
ప్రేమంటే అంతేరా పిచ్చివాడా..

***ఆత్మబలం (1964 )***



పశువులకన్న పక్షులకన్న మనిషిని మిన్నగ చేశాడు
బుద్ధిని ఇచ్చి హృదయాన్నిచ్చి, భూమే నీదని పంపాడు
బుద్ధికి హృదయం లేక - హృదయానికి బుద్ధే రాక
నరుడే యీ నరలోకం - నరకం చేశాడు

***దాగుడు మూతలు (1964)***

మనసిచ్చినదే నిజమైతే
మన్నించుటయే ఋజువు కాదా..

***మురళీకృష్ణ (1964)***



పూలదండలో దారం దాగుందని తెలుసును
పాలగుండెలో ఏది దాగుందో తెలుసునా
నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి
ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసునా..

*మూగమనసులు (1964)*

మణిసి తోటి యేళాకోళం, ఆడుకుంటే బాగుంటాది
మనసుతోటి ఆడకు మాఁవా ఇరిగిపోతే అతకదు మల్లా

*మూగమనసులు (1964)*

గుండె మంటలారిపే సన్నీళ్ళు కన్నీళ్ళు
వుండమన్న వుండవమ్మ శాన్నాళ్ళు
పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు
వున్నోళ్ళూపోయినోళ్ళ తీపిగురుతులు..

*మూగమనసులు (1964)*

---

## వీరెవరబ్బా..!? సమాధానాలు

1.టంగుటూరి సూర్యకుమారి

2.సూర్యాకాంతం

3. సావిత్రి

4. శోభన్‌బాబు

5. ఆరుద్ర